## క్లుప్తంగా

### ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజులు

**కల్లూరు:** జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు రాజకీయాల్లో, ప్రభుత్వ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పతానపు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కల్లూరు ఎన్ఎస్‌పీలో మారబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో.. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మత్స్య సహకారం సంఘం కల్లూరు మండల అధ్యక్షుడు చింతకాయల వెంకటేశ్వర్లు, మాజీ డైరెక్టర్ మారేష్ (నారాయణ), వెంకటేశ్వర్లు, వేలాద్రి, నరసింహారావు, బాలకృష్ణ, పిచ్చయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### కళాశాలకు ఇన్వర్టర్



ప్రిన్సిపాల్‌కు ఇన్వర్టర్ అందజేస్తున్న శెట్టిపల్లి నాగేశ్వరరావు

**ఏన్కూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శెట్టిపల్లి నారాయణ, బసవమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు రూ.20వేల విలువ గల ఇన్వర్టర్‌ను ప్రిన్సిపాల్ యం.సింహాచలంకు శనివారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు నాగేశ్వరరావు, పిచ్చయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### 'వ్యక్తిత్వ వికాసం'పై శిక్షణ



మాట్లాడుతున్న ట్రెయినీ మమత

**వైరా:** వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ ట్రెయినీ మమత, ఎన్ఎస్ఎస్ పీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో లక్ష్యంపై గురిపెట్టి చదవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్ నవీన జ్యోతి, బాలికల కౌన్సిలర్ స్వప్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

### 29న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

**ఏన్కూరు:** మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గత 3రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించవలసిందిగా నిర్వాహకులు కోరారు.

### దివ్యాంగులకు ఆహార పొట్లాలు పంపిణీ



**సత్తుపల్లి:** పేదల నేస్త సేవా సంఘం ఆధ్వర్యంలో స్వర్ణిక దివ్యాంగుల ఆశ్రమంలో శనివారం దివ్యాంగులకు ఆహార పొట్లాలు, బ్రెడ్ ప్యాకెట్లు, మిఠాయిలను పొలడుగు దుర్గాప్రసాద్ అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రవి, వెంకటస్వామి, హర్ష, బాజీబాబా, నగేష్, సురేష్ పాల్గొన్నారు.

### వృద్ధులకు నిత్యావసరాలు..



బనిగండ్లపాడులో వృద్ధులకు సరుకులు అందిస్తున్న సైమన్

**ఎర్రుపాలెం:** మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో శనివారం స్థానిక కారుణ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకులు చర్చి ఫాదర్ సైమన్ 20మంది పేద వృద్ధులకు రూ.10వేల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ.. పేదలకు సాయం చేయడంలో తమకు ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సేవకురాలు జ్యోతి, సంఘస్తులు, పాల్గొన్నారు.



అక్రమంగా ఎడ్ల బండ్లతో ఇసుకను తోలుతున్న దృశ్యం



ఇసుక లేక నిర్మాణం నిలిచిపోయిన భవనం

# ఇసుక.. కష్టమే!

- గృహ నిర్మాణాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఆటంకం
- హడావిడిగా రేవును ప్రారంభించిన అధికారులు
- తోలకాలు మాత్రం నిల్
- మండిపడుతున్న భవన యజమానులు

**ఎర్రుపాలెం:** మండలంలో కట్లేరు నిండా ఇసుక ఉంది. అయినా ప్రజలకు ఇసుక కష్టాలు మాత్రం తీరడం లేదు. ఇండ్ల నిర్మాణాలు చేసే వారు, భవన నిర్మాణ కార్మికులు గత కొంతకాలంగా ఈ సమస్యపై ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా.. పట్టించుకున్న పాపాన పోలేదు. ఇసుక రవాణాకు సంవత్సరం కాలంగా ప్రభుత్వం బ్రేకులు వేయడంతో మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న నూతన గృహాలు, ప్రభుత్వం చేపడతున్న అభివృద్ధి పనులు నిర్మాణ దశలోనే నిలిచిపోతున్నాయి.

**అధికారులకు మొరపెట్టుకున్న ప్రజలు..**

దాదాపు సంవత్సర కాలంగా రేవుల నుంచి ఇసుక రవాణా లేకపోవడంతో పలువురు బాధితులు, అధికార పార్టీ నాయకులు ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన ఐకేపీ(ఇందిరా క్రాంతి పథకం) మహిళల ద్వారా ఇసుక రవాణా చేపట్టాలని మండల యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో హడావిడిగా తహసీల్దార్, ఐకేపీ ఏఎంపీ తదితర అధికారులు కట్లేరు ఆయకట్టు పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామంలోని ఇసుక రేవును రవాణా చేసుకునే వీలు కల్పిస్తూ లాంఛనంగా ప్రారంభించారు.

**అభ్యంతరాలతో నిలిచిన తోలకాలు..**

స్థానిక గ్రామస్తులు, నాయకులు మాత్రం ఇక్కడ రేవు నుంచి ఇసుకను తరలించడానికి వీలు లేదని, తరలిస్తే వ్యవసాయ బోర్లల్లో సాగునీరు అడుగంటిపోతుందని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. స్థానిక అధికార యంత్రాంగం చేసేది లేక మిన్నకుండిపోయింది. నేటికి ఒక్క ట్రాక్టర్‌తో కూడా ఇసుకను తరలించని పరిస్థితి నెలకొంది.

– గతంలో మండలంలోని రామన్నపాలెం, సఖినవీడు, చొప్పకట్లపాలెం, రాజులదేవరపాడు గ్రామాల్లోని కట్లేరు ఇసుక రేవుల నుంచి ఇసుక తోలకాలకు అనుమతి ఉండేది. రూ.1,100 డీడీ చెల్లిస్తే ఒక ఇసుక ట్రాక్టర్ తోలకానికి అనుమతి ఇచ్చేలా తహసీల్దార్ కూపన్లు జారీ చేశారు. అప్పట్లో ఇసుక రేవులు ఉన్న గ్రామ పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరేది. ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించారు. నేడు ఆ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకడంతో ఇసుక కష్టాలు ఆరంభమయ్యాయి.

**భవన కార్మికుల మండిపాటు..**

అందుబాటులో కట్లేరులో ఇసుక ఫుల్‌గా ఉన్నా.. పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని భవన కార్మికులు మండిపడుతున్నారు. కొందరు అధికారుల కళ్లు కప్పి సమీప రేవుల నుంచి ఎద్దుల బండ్లతో ఇసుకను తరలిస్తున్నారు. ఒక బండి ఇసుకకు రూ.800 నుంచి 900 వరకు ధరను చెల్లించాల్సి వస్తుంది. మహిళలకు ఆర్థికస్వావలంబన కల్పించేందుకు గానూ ఐకేపీ ద్వారా ఇసుక రేవుల నిర్వహణ చేపట్టాలని ప్రయత్నాలు చేసినప్పటికీ ఆదిలోనే రైతులు, ప్రజల అభ్యంతరాలు అడ్డంకిగా మారాయి.

**పనులు చేయలేకపోతున్నాం.**



మండలకేంద్రంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాం. ఇసుక లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. దాదాపు సంవత్సరాలుగా ఇసుక లేక అల్లాడుతున్నాం. నత్తనడకగా ఇంటి నిర్మాణం చేస్తున్నాం. అప్పుడుపుడు రేటు అధికమైనప్పటికీ ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఇసుక రేవులకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నా.

– దామెర్ల శ్యామ్‌సుందర్‌రావు, ఎర్రుపాలెం

**అభ్యంతరాలు వచ్చాయి..**



ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్‌తో కలిసి ఈనెల 16వ ఐకేపీ ఆధ్వర్యంలో తక్కెళ్లపాడులోని కట్లేరు ఇసుక రేవును లాంఛనంగా ప్రారంభించాం. స్థానిక రైతులు ఇసుక తోలకాలు జరపొద్దని అభ్యంతరాలు తెలిపారు. దీంతో ఒక్క ఇసుక కూపన్ కూడా జారీ చేయలేదు. రేవులో ప్రస్తుతం నిర్వహణ జరపడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కె.వెంకటేశ్వర్లు, ఐకేపీ, ఏపీఎం, ఎర్రుపాలెం

## క్రైస్తవుల సంక్షేమానికి కృషి



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

**సత్తుపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో శనివారం క్రైస్తవులకు ప్రభుత్వ క్రిస్మస్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రంలో క్రిస్టియన్ భవనాలు నిర్మిస్తామన్నారు. పేద పాస్టర్లు క్రైస్తవులకు ఇల్లు నిర్మించి ఇస్తామని, పాస్టర్లకు ఉపకార వేతనాలు అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, తహసీల్దార్ యోగేశ్వరరావు, డాక్టర్ మట్టా దయానంద్, ఎండీ కమల్ పాషా, గాదె చెన్నారావు, చల్లగుళ్ల నర్సింహారావు, తోట సుజలరాణి, నారాయణవరపు శ్రీనివాస్, శ్యామ్యూల్ జాషువా గద్దం, పింగళి సామేలు, బేతంపూడి వరప్రసాద్, శ్యామ్‌సన్, శ్రీనివాస్, రవికిరణ్ పాల్గొన్నారు.

**క్రైస్తవ కుటుంబాలకు ప్రేమ విందు..**

**పెనుబల్లి:** క్రైస్తవ కుటుంబాలకు తెలంగాణా ప్రభుత్వ ఆర్థిక సాయంతో శనివారం మండల పాస్టర్ల ఆధ్వర్యంలో పెనుబల్లి జెహెచ్ఎంఎస్ చర్చిలో ప్రేమ విందు కార్యక్రమం నిర్వహించినట్లు చర్చి పాస్టర్ బీరెల్లి వరప్రసాద్ తెలిపారు. ఈ విందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.37వేలు ఆర్థిక సాయం అందించిందన్నారు. కార్యక్రమానికి తహసీల్దార్ ప్రతాప్, ఏబీసీసీ అధ్యక్షుడు డేవిడ్ పాల్, మండల పాస్టర్లు వరప్రసాద్, సుధీర్‌బాబు, ప్రశాంత్ కుమార్, పేతురు, విజయ్, నాగేశ్వరరావు, వేణుపాల్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల సమస్యలపై స్పందిస్తాం




కల్లూరు ఆర్డీఓను సన్మానిస్తున్న దృశ్యం

**కల్లూరు:** మానవ హక్కుల పరిరక్షణలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్ పేర్కొన్నారు. శనివారం ఆలిండియా హ్యూమన్‌రైట్స్ జాతీయ కార్యవర్గ నిర్వాహక అధ్యక్షుడు కేఆర్ రాజన్న, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వినుకొండ శ్రీనివాసరావు ఆర్డీఓను కలిసి మాట్లాడారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి చైతన్య పరుస్తామన్నారు. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలు, బాలకార్మికుల దుస్థితి, మానవ అక్రమ రవాణ, దురాచారాలు, అవినీతి అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అధికారుల దృష్టికి తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగాఆర్డీఓను ఘనంగా సన్మానించారు.




చిరుమర్రి పాఠశాలలో అలంకార ప్రాయంగా ఉన్న నల్లాలు

## నాసిరకం నల్లాలు.. పైపై మెరుగులు





చిరుమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విరిగిన నల్లాలు

**ముదిగొండ:** మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు మొత్తం 53 ఉన్నాయి. వాటిలో కనీస మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులు మంచినీరు తాగేందుకు ప్రతి పాఠశాలకు రూ.లక్షతో నల్లాలు ఏర్పాటు చేశారు. ఈ నల్లాలు మూడునాళ్ల ముచ్చటగానే ఉన్నాయి. నాసిరకం నల్లాలు అమర్చి చేతులు దులుపుకున్నారు. మంచినీటి సరఫరా చేయకుండానే ఈ నల్లాలు విరిగిపోయాయి. ఒక్కో స్కూల్‌లో చేతులు శుభ్రం చేసుకునేందుకు, మంచినీటిని తాగేందుకు ఉపయోగ పడేలా నిర్మించిన వీటిని ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు నిర్లక్ష్యం కారణంగానే గుత్తేదారులు నాసిరకం పైపులతో అమర్చడం వలన కొద్ది రోజులకే అవి పాడైపోయాయని ఆరోపణలొచ్చాయి. అధికారులు స్పందించి నాణ్యమైన నల్లాలను అమర్చి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

### 'మిస్ట్'అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మురళీకృష్ణ

**సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పంతంగి మురళీకృష్ణకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ–69 న్యూస్ ఛానల్ ద్వారా సామాజిక సేవలో భాగస్వామ్యులు కావడంతో ప్రకటించిన డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. ఈసందర్భంగా మురళీకృష్ణను ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డైరెక్టర్ కందిమళ్ల కృష్ణారావు, అధ్యాపకులు అభినందించారు.

### వెంకటేశ్వర్లుకు గానకోకిల అవార్డు



అవార్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి, సంస్థ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌యాదవ్

**కొణిజర్ల:** మండలంలోని పెద్దగోపతికి చెందిన ప్రముఖ జానపద గాయకుడు నకిరికంటి వెంకటేశ్వర్లుకు ఉత్తమ ఉద్యమ గానకోకిల అవార్డు లభించింది. శనివారం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మేకల చంద్రశేఖర్‌యాదవ్, మాజీ శాసన సభ్యుడు చాడ వెంకటరెడ్డి చేతుల మీదుగా వెంకటేశ్వర్లకు అవార్డు అందించారు. జానపద గీతాలతో పాటు ఉద్యమ పాటలు, భక్తి గీతాలు ఆలపించినందుకు గాను వెంకటేశ్వర్లును అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును తెలంగాణ సాంస్కృతిక సారధి సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ

**తల్లాడ:** మండలంలోని అన్నారుగూడెం గ్రామ పంచాయతీ కార్మికుడు కొత్తపల్లి సుందరయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన భౌతిక కాయాన్ని శనివారం ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి పరామర్శించారు. మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆ కుటుంబానికి అందించి.. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎండి.తాజుద్దీన్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు ఇమ్మడి రామకృష్ణ, లాజరు, దాసు, కృష్ణ, ఆరోను, బుజ్జి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, తిరమల్‌రావు, రమేష్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## జీపీ వర్కర్ల వేతనాలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

**బోనకల్:** ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలను తక్షణమే ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య, విద్యుత్, నీటిసరఫరా పనుల్లో మల్టీపర్పస్ వర్కర్లుగా పనిచేసే కార్మికులు వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఉద్యోగ భద్రత లభిస్తుందనే ఆశతో చాలిచాలని జీతంతో కుటుంబాన్ని నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కుల రామారావు, ఆకెన పవన్, వర్కర్లు షేక్ ఖాసీం, మరీదు పుల్లయ్య, బోయిన ప్రసాద్, కొమ్ము లక్ష్మయ్య, గార్లపాటి నాగరాజు, బొడ్డుపల్లి సైదులు, గుణకుంట్ల బాబు, దారా సురేష్, మాతంగి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

**నిరవధిక సమ్మె చేస్తాం..**



సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు

**చింతకాని:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేపడతామని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల జీవనం దయనీయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు జయ, ఖాదర్‌బాబు, నాగేశ్వరరావు, సైదులు, నర్సింహారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలను బలపర్చండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

**వైరా:** ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎం ప్రజా ఉద్యమాలను బలపర్చాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం వైరాలో తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా డివిజన్‌లో పోడు భూముల, మహిళల పక్షాన పోరాడిన ఘనత సీపీఎందేనన్నారు. జనవరిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, దీనిపై ఏన్కూరులో జనవరి 2న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మొదటివారంలో సీపీఎం ఇంటింటి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, నాయకులు నాగేశ్వరరావు, కృష్ణ, చలపతిరావు, నాగేశ్వరరావు, కుటుంబరావు, నరేంద్ర శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొలం బాట పట్టిన విద్యార్థులు



వరిపొలంలో నారుతో విద్యార్థులు

**కొణిజర్ల:** ఖమ్మం నగరానికి చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శనివారం పొలం బాట పట్టారు. మండలంలోని పెద్ద మునగాలకు చెందిన మురళీ కృష్ణ పొలంలో వరి నాటు వేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బాలాజీ వారికి వ్యవసాయం వివిధ పంటల సాగు విధానాలు గురించి వివరించారు. పాఠశాల కోఆర్డినేటర్ పద్మ మాట్లాడుతూ.. రైతు దేశానికి వెన్నుముక అని రైతు పడే కష్టాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. భోజనాన్ని ఎవరూ వృధా చేయొద్దని చిన్నారులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈఓ సరిత, రైతులు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహాసభకు తరలిన ఉపాధ్యాయులు



మహాసభకు వెళ్తున్న ఉపాధ్యాయులు

**మధిర:** నల్లగొండలో మూడు రోజులపాటు జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 6వ విద్యా, వైజ్ఞానిక మహాసభలకు శనివారం మధిర ప్రాంతం నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. టీఎస్‌యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బస్సును యూనియన్ సీనియర్ నాయకులు తాళ్లూరి ఆంజనేయులు, రావూరి లక్ష్మణరావు తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించిందని తెలిపారు. మహాసభలకు తరలిన వారిలో షేక్ నాగూర్ వలి, కోటేశ్వరరావు, వినోద్ రావు, నాగరాజు, వీరయ్య, ఇబ్రహీం ఉన్నారు.

### హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన హ్యూమన్‌రైట్స్ సభ్యులు



**కల్లూరు:** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పంచాక్షరిని శనివారం హైదరాబాద్‌లో హ్యూమన్ రైట్స్ టీమ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డపాటి దాసు, రాష్ట్ర అధ్యక్షురాలు ఎనుముల రుక్మిణి, రాష్ట్ర ఇన్‌చార్జ్ తేళ్లూరి చిన్న యేసు, రాష్ట్ర కన్వీనర్ మంచు కిరణ్‌లు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చట్టాలపై, హక్కులపై, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు, గ్రామ దీపికలకు, కళాశాలలు, ఆస్పత్రుల్లో కల్పిస్తున్న అవగాహనను.. ప్రభుత్వం గుర్తించి పారా లీగల్ వాలంటీర్లుగా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

### హౌసింగ్ కార్యాలయం నిర్మాణానికి భూమి అప్పగింత



స్థలాన్ని అప్పగిస్తున్న తహసీల్దార్ చందర్

**బోనకల్:** ఇందిరమ్మ గృహ నిర్మాణశాఖ కార్యాలయ నిర్మాణానికై మండల కేంద్రంలోని 200 చదరపు గజాల స్థలాన్ని శనివారం స్థానిక తహసీల్దార్ పున్నం చందర్ ఆర్అండ్‌బీ ఏఈ రాజేష్‌కు అప్పగించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

### కేసు నమోదు

**పెనుబల్లి:** మండలంలోని గంగదేవిపాడు గ్రామానికి చెందిన ముత్యాలరావు, అతని తండ్రి వెంకటి, అదే గ్రామానికి చెందిన తేళ్లూరి రామారావులు పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని గొడవపడ్డారు. ముత్యాలరావు ఫిర్యాదు మేరకు వీయంబంజర్ పోలీస్ స్టేషన్ ఎస్సై కె.వెంకటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

**ఎర్రుపాలెం:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశానికి, కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాప్‌రెడ్డి, నాయకులు పూర్ణచంద్రారెడ్డి, నర్సింహారావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, పిచ్చిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగారావు, పుల్లారెడ్డి, రాజీవ్‌గాంధీ, నారాయణ, బాబురావు, ఇస్మాయిల్, బాబూరావు, వెంకటనర్సయ్య, అనీల్‌కుమార్, జనార్దన్ పాల్గొన్నారు.